# చారుశీల

అర్ధరాత్రి మెలకువ వచ్చి చూస్తే మంజిష్ఠ ఎక్కడా కనపళ్లేదు శశాంకమౌళికి. ఆమె రోజూ హాల్లో నిద్రపోతుంది. అక్కడ లేదు. ప్రక్కగదిలోనూ లేదు. వీధి తలుపు తెరచి వుంది. వరండాలోకి వెళ్ళి చూశాడు అక్కడ వసారా అంచున చెయ్యి తల దిండుగా పెట్టుకుని నిద్ర పోతుంది. ముందర వేపున ఉన్న చెట్ల నీడలు ఆమె ముఖం మీద పడుతున్నాయి. ఆకుల సందుల్లో నించి వెన్నెల పడుతోంది. ఆమె ముఖం అమాయకంగా అందంగా వుంది. కంటి వెంట కన్నీటి చారలు కనిపిస్తున్నాయి.

శశాంకమౌళికి జాలి ముంచుకు వచ్చింది. ఈ పిల్ల ఎలా సుఖపడుతుంది? ఈమె బ్రతుకు భారం తనపై ఆధారపడి వుంది. తను ఏలా ఆమెను ఉద్ధరించగలడు? ఎలా తన బాధ్యత నెరవేర్చుకోగలడు? అతని మనస్సు అయోమయంగా ఉంది.

ఆమె తన అక్క కూతురు. చిన్నప్పుడు ఆమెను ఎత్తుకున్నాడు, ఆడుకున్నాడు, పాటలు నేర్పినాడు. అది పసి తనం. తరచుగా అక్క దగ్గరకు వెళుతూనే ఉన్నాడు. ఒక్కొక్క సారి, మంజిష్ఠ కొంచెం-కొంచెంగా ఎదుగుతూ కనిపించింది. ఒక్కొక్కసారి మరింత-మరింత దృఢంగా తనను పెనవేసుకుంది. తనతోటే ఆటలు, షికార్లు, కబుర్లు! తనకూ ఆ పిల్ల అంటే మరీ-మరీ ప్రేమ ఎక్కువైంది. ఆమె తన కూతురు లాగే అనిపించింది. ఆ అనుబంధం చూసి అక్క సంతోషించింది.

రెండేళ్ళుగా తను ఆ ఊరు పోలేదు. చిత్రకళ చక్కగా అభ్య సించాలని ఈ ఊరు వచ్చాడు. ఇక్కడి సుందరమయిన ప్రకృతి దృశ్యా లను చిత్రిస్తూ కాలం గడిపాడు తరువాత ఇక్కడే స్థిరపడి పోయాడు. ఇక్కడ తనకు చారుశీల పరిచయమయింది. ఆమె అందంగా-నాజూకుగా కదులుతున్న లతలా ఉంది. లతలా తనను పెనవేసుకుంది. ఆమెను వివాహం చేసుకున్నాడు. ఇక్కడే ఉండిపోయాడు.

చారుశీల చక్కగా బొమ్మలు వేస్తుంది. చక్కగా పాడుతుంది. ఆమెకు పద్యాలన్నా, పాటలన్నా ఎంతో యిష్టం. ఏ పని చేస్తున్నా ఆమె నోట పాట పలుకుతూనే ఉంటుంది. ఆమెలో ఒకటే లోపం. ఆమె తనను విడిచి ఒక్క క్షణం ఉండలేదు. లోపల ఏదో పని చేస్తున్నా బయట తను ఉన్నాడో లేదోనని మాటిమాటికి తొంగి చూసి నవ్వుతూ ఉంటుంది. ఎక్కడికయినా బయటకు వెళితే మళ్ళీ వచ్చేవరకు వాకిట్లోనే తచ్చాడుతూ ఎదురుచూస్తూ ఉంటుంది. తను ఎప్పుడైన ఏదైనా బొమ్మ వేసుకుంటూ ఉంటే మౌనంగా ఎదురుగా ఉంటుంది. ఎప్పుడు పూర్తి అవుతుందా ఎప్పుడు పలకరించవచ్చా అని ఓపికతో క్షణాలు లెక్క పెడుతూ ! ఆమె అనుబంధం ఊపిరి సలపనీయదు. అరక్షణం అడుగు దాట నివ్వదు. ఆమె మీద మమత నిండిన తనకు ఎప్పుడూ దాటాలనీ ఉండదు !

మంజుష తన దగ్గరకు వచ్చి ఆరు నెలలయింది. దాని కథ విచిత్రంగా ఉంది. అక్కయ్య పోయింది. ఎవరూ లేనిదాన్ని తను తీసుకురాక తప్ప లేదు. ఆమెకు వరుణ్ణి చూడాలి, పెళ్ళి చెయ్యాలి. అప్పుడు తన బాధ్యత వదులుతుంది. ఆమెకు ఎవరి మీదైనా అనురాగం ఏర్పడితే తాను ధన్యుడు. ఆమెను అతనికి అప్పగించి తాను బాధ్యత తీర్చుకోవచ్చు. కాని అల్లాంటి ఆశలన్నీ అడుగంటుతున్నాయి. ఆమెకు విపరీతమైన అనురాగం ఏర్పడింది అది ఎవరిమీదోకాదు తన మీదే ! అంతకు ముందు దాన్నిచూసి రెండేళ్ళ

యింది. అప్పటికది యింకా బాగా ఎదగలేదు, ఇంకా పసి పిల్లగానే ఉంది. ఇప్పుడు ఎంతో ఎదిగింది. ఎంతో అందంగా ఉంది. అయితే తన మనసులో అది యింకా చిన్న పిల్లగానే ఉంది. అది తన అక్కకూతురు. తన బిడ్డలా దాని మీద తనకు ప్రేమ ప్రవహిస్తోంది. దాని మనసు మామయ్యను మరొక మమతతో చూస్తోంది. చిన్నప్పటి ప్రేమ యిప్పుడు మహావృక్షమై దాని గుండెల్లో గూడు కట్టుకుంది. చారుశీలలాగే అదీ యిప్పుడు తనను క్షణం వదలలేకుండా ఉంది. క్షణం కంటికి దూరమైతే ఏదో పోగొట్టుకున్న దానిలా విల విల లాడుతోంది. తను తప్ప ఆమెకు ఎవరూ లేరు. ఆమె మమకారంతో తనను చుట్టుకుంటే తనకు ఏం చెయ్యడానికి తోచటంలేదు. కసురుకుని దూరంగా ఉంచితే మరీ-మరీ కుమిలి పోతుంది. ఆప్యాయంగా పలకరిస్తే మరీ-మరీ పెన వేసుకు పోతుంది.

ఒకసారి పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు. "మంచి వరుణ్ని చూసి నీకు పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాను" అన్నాడు ఉత్సాహంగా. దాని ముఖం జేవురించింది. "పెళ్ళి చేసి విముక్తి పొందుదామనుకుంటున్నావా ?" అంది. కాస్సేపటికి దూరంగాపోయి కన్నీరు కారుస్తూ కూర్చుంది. మరొక సారి తన స్నేహితుణ్ని తీసుకు వచ్చాడు, అతను ఎంతో మంచివాడు. అతన్ని మంజిష్ఠ పరిణయమాడితే అదృష్ట వంతురాలు. వారిద్దరికి పరిచయం చేశాడు. "ఇతను శశిధర్ బాగా పాడుతాడు, బొమ్మలు వేస్తాడు. నాకన్నా చదరంగం బాగా ఆడతాడు. ఇతనితో కాస్సేపు ఆడు" అన్నాడు. చదరంగం బల్లా, కాయలు తెచ్చి అక్కడ పెట్టి తాను లోపలికి వెళ్ళాడు. కాస్సేపటికి మళ్ళా వచ్చి చూస్తే అక్కడ మంజిష్ఠ లేదు. తోటలోపల ఎక్కడో దూరంగా తిరుగుతోంది. శశిధర్ ఒక్కడూ దిక్కులు చూస్తూ కూర్చున్నాడు. చదరంగం బల్ల ఖాళీగా ఉంది. తనకు మనస్సు చివుక్కుమంది. ఈ పిల్లకెప్పుడర్థమౌతుంది! ఎప్పుడు మనస్సు మారుతుంది ?

ఏమి పాలుపోలేదు. ఎప్పుడు శశిధర్ వచ్చినా మంజిష్ఠ తోటలోకి పోతుంది మళ్ళారాదు. రెండు-మూడు సార్లు అతన్ని పిలిచి యింటికి తీసుకువచ్చి చేసేదిలేక ప్రాణం విసిగి ఊరుకున్నాడు. ఇంకెవరినైనా పరిచయం చేద్దామనా అంతే మంజిష్ఠ ఉలకదు, పలకదు వీలయితే పారిపోతుంది. ఆ పిల్ల ఒక గమ్యం చేరేవరకు తనకు మనశ్శాంతి లేదు.

మంజిష్ఠ వచ్చినప్పటి నుంచి చారుశీల తనను మరీ పెనవేసుకుంటోంది. క్షణం వదలదు. మంజిష్ఠ దగ్గర తాను ఉన్న క్షణంలో ఆమె వెంటనే వస్తుంది.... ఏదో మిషతో పిలుస్తుంది. ఎక్కడికో పోదామంటుంది. మంజిష్ఠతో చదరంగమాడుతూ ఉంటే 'షికారు పోదామా' అంటుంది. కొండలోయ వైపు నడిచి వెళితే మంజిష్ఠ రాదు. వచ్చినా మాట్లాడకుండా వెనకడుగులు వేస్తూ ఉంటుంది. మంజిష్ఠకు బొమ్మలు వెయ్యడం నేర్పితే, చారుశీల కంఠమెత్తి హాయిగా పాడుతుంది. మంజిష్ఠ గీతలు తప్పు వేస్తుంది. చారుశీల ఆమెను ప్రేమతోనే చూస్తుంది. అయినా తనకి ఊరట లేదు. వాళ్ళిద్దరికి మధ్య తానునలిగి పోతూన్నట్లున్నది.

* * *

చారుశీల బయటికి వచ్చింది. "నిద్రపోలేదా ?" అంది. అతను ఉలిక్కి పడ్డాడు. చేస్తున్నది ఏమీ లేకపోయినా ఏదో తప్పు చేసినట్లు కలవర పడ్డాడు. నిర్లిప్తంగా అన్నాడు "మంజు యిక్కడే నిద్రపోతుంది." చారుశీల మాట్లాడలేదు. ఆమెకు మంజిష్ఠను గురించిన ఆలోచనలేదు. మౌళి లోపలికి వస్తే నిద్రపోవాలని ఉంది. ఆమెకు నిద్రతూగుతుంది. "లోపలకు రండి" అంది. అతను మౌనంగా ఆమె వెనకాలే వెళ్ళాడు. ఆమె వీధి తలుపు వేసింది. అతను ఉలిక్కి పడ్డాడు. "మంజు అక్కడ ఒంటరిగా ఉంది" అన్నాడు. తూగుతూ చారుశీల అంది, "ఫరవాలేదు నిద్రపోనివ్వండి.

భయమేముంది? తెల్లవారుతోంది గదా" మెల్లగా చెయ్యి పట్టుకుని లోపలకు లాక్కుపోయింది. తెల్లవారాకగాని మంజిష్ఠకు మెళకువ రాలేదు.

ఆ వేళ శుక్రవారం. ఆ సాయంత్రం చారుశీల శుక్రవారం గదా! కాళికాదేవిగుడికి వెళదామంది. మంజిష్ఠ మొన్నటి వానకి నది ఉప్పొంగిదంట గదా! వెళ్ళి చూద్దామంది. గుడికి వెళ్ళి తరువాత నది ఒడ్డుకు వెళదామన్నాడు శశాంకమౌళి. ముగ్గురూ ముస్తాబై బయలుద్దేరారు. చారుశీల తలంటుకుంది. తెల్లని చీర కట్టుకుంది. కంటికి కాటుక పెట్టుకుంది. కాళ్ళ నిండా పసుపు పూసుకుంది. తలనిండా పువ్వులు పెట్టుకుంది. రతీదేవిలా మెరసిపోతుంది. మంజిష్ఠ కూడా తలంటుకుంది. పసుపు పచ్చని చీర కట్టుకుంది. జుట్టు విరయబోసుకుంది. పచ్చని చీర కొంగు, విరబోసుకున్న వెంట్రుకలు కొంత గాలికి చెదరిపోతున్నాయి.... శశాంకమౌళి తెల్లని పంచె, లాల్చీ వేసుకున్నాడు. మంచి గంధం రాసుకున్నాడు. పచ్చని శరీరం మెరసిపోతోంది.

ఊరు దాటి రెండు మూడు మైళ్ళు వెళితేనేగాని నది రాదు. మధ్యలో ఎక్కడో మలుపు తిరిగితే గుడి వస్తుంది. పొదల మధ్యగా సన్నని కాలి బాట ఉంది. దాన్నంటి మెల్లగా పోవాలి. చారుశీల మెల్లగా పాడుతోంది. "మేరే తో గిరిధరలాల దూసరా నకోయీ-" శశాంకమౌళి పాట వింటూ అడుగులు వేస్తున్నాడు. మంజిష్ఠ శూన్యంగా నడుస్తోంది.

కాస్సేపటికి గుడి వచ్చింది. మంజిష్ఠ గుళ్ళోకి రానంది. బయటనే ఒక రాతి బండ మీద కూర్చుంది, చెట్ల పొదలను నిర్మలంగా ఉన్న ఆకాశాన్ని చూస్తూ. చారుశీల ఆమెను బలవంతం చెయ్యలేదు. తాను లోపలకు వెళ్ళింది. కూడా శశాంకమౌళి వెళ్ళాడు. కాస్సేపటికి యిద్దరూ బయటకు

వచ్చారు. చారుశీల తల్లో గుళ్ళో యిచ్చిన పువ్వులు తురుముకుంది. ముఖాన పెద్దదిగా అమ్మవారి కుంకం పెట్టుకుంది. చేతిలో పువ్వులు, కుంకం మంజిష్ఠకు యిచ్చింది. మంజిష్ఠ కుంకం తీసుకుంది. పువ్వులు శశాంకమౌళి కిచ్చింది. మంజిష్ఠకు ఎదురుగా మరొక రాతిబండ మీద చారుశీల, శశాంకమౌళి కూర్చున్నారు. మౌళి నవ్వుతో అన్నాడు, "ఏమని వరం కోరుకున్నావు?" చారుశీల నవ్వుతూ చెప్పింది "జన్మ-జన్మలా మీరే భర్త కావాలనీ, ఈ అనుబంధం ఎప్పుడూ విడిపోకూడదనీ. "మంజిష్ఠ దిగులు పడింది. జన్మ-జన్మలా తను మామయ్యకు దూరంగానే ఉంటుంది. ఎప్పుడూ ఎడ-ఎడంగా దిగులుతో నశించి పోతుంది. ఐనా అంతలో తేరుకుంది. స్వగతంలా అంది, "నాకు జన్మాంతరంలో నమ్మకం లేదు." చారుశీల, శశాంకమౌళి నవ్వారు. మళ్ళీ ముగ్గురూ లేచి బయలుదేరారు.

రెండు రోజులు ఎడతెగకుండా వాన కురిసింది. నదీ ఉధృతంగా ఉంది. నది ఒడ్డున ఒక చెట్టు క్రింద కూర్చున్నారు. చుట్టూ పొన్న పువ్వులు రాలిఉన్నాయి. నదిలో ఎడ ఎడంగా పెద్ద బండరాళ్ళు ఉన్నాయి. పొద్దు వాలుతోంది. ఇంకాస్సేపటికి చీకటి పడుతుంది.

చారుశీల పాట పాడింది. "లలిత లవంగ లతా పరిశీలన కోమల మలయ సమీరే." చల్లటి గాలి వీచింది. మంజిష్ఠ మెల్లగా లేచి నీళ్ళలోకి వెళ్ళింది. చిన్న చిన్న బండలమీదుగా దాటి వెళ్ళి నది మధ్యగా ఒక పెద్ద బండమీద కూర్చుంది. చారుశీల ఒడిలో పడుకుని పాట వింటున్న శశాంకమౌళి ఆమె ఎటు వెళ్ళిందీ గమనించలేదు. చారుశీల మరొక పాట పాడింది. "మంజుతర కుంజతలకేళి సదనే, ప్రవిశ రాధేమాధవ సమీపం"

"బండమీద కూర్చున్న మంజిష్ఠ లేవబోయింది. కాలుజారింది. మామయ్యా అని ఒక్క కేకపెట్టింది. మరుక్షణం నీళ్ళలో మునిగిపోయింది. శశాంకమౌళి ఉలిక్కిపడి లేచాడు. అతనికి ఏమైందీ అర్థమయ్యేటప్పటికి అరక్షణం పట్టింది. ముందుకు పరుగెట్టాడు. మరుక్షణం చారుశీల

అతన్ని గట్టిగా పట్టుకుంది వదల్లేదు. "ప్రవాహం ఉధృతంగా ఉంది. చీకటి పడుతోంది. మీరు ఏమీ చెయ్యలేరు" ఆవేదనతో ఆమె కంఠం వణికిపోతోంది. ఒక్క క్షణం శశాంకమౌళి పెనగులాడాడు. చారుశీల పట్టు వదల్లేదు. "ఈ ప్రవాహంలో దుమికి మీరు మళ్లా బయటకు రాలేరు" ఆమె ఏడుస్తోంది.

మంజిష్ఠ ఏమైపోయిందో ఎక్కడా కనిపించడంలేదు. చాలాదూరాన ఒక్క క్షణం ఎవరివో మాటలు వినిపించాయి.

"ఎవరో కొట్టుకుపోతున్నట్లున్నారు పడవలాగండి."

"ఈ ప్రవాహంలో ఈ చీకట్లో ఏమీ లాభం లేదు. నది ఉప్పొంగు తోంది."

మళ్ళీ మాటలు వినిపించలేదు. మనుష్యులు కనిపించలేదు. చీకటి దట్టంగా అలముకుంది.

ఉసూరుమని శశాంకమౌళి చారుశీల ఇంటి ముఖం పట్టారు. మౌళి కంటివెంట కన్నీరు కారుతోంది. ఈ నదికి ఇందుకోసమే వచ్చామా అని పిస్తోంది. ఒక్క క్షణం అక్కయ్య ఎదురుగా నిలబడి ఏడుస్తూ ఉన్నట్లని పిస్తోంది. ఒక్క క్షణం మంజిష్ఠ అమాయకంగా చూసినట్లనిపిస్తోంది. "మామయ్యా" అన్న పిలుపు వినిపిస్తోంది. ఒళ్ళంతా నిస్సత్తువ కమ్ము కుంది. ఒక విధంగా మంజిష్ఠ అదృష్టవంతురాలు బ్రతికి ఏం సుఖం! అనుచితమైన చోట అనురాగం ఏర్పడింది.

నీరసంగా అడుగులు ముందుకు వేస్తున్నాడు. త్రోవ తెలియటం లేదు. చారుశీల ప్రియంగా చెయ్యిపట్టుకుని మెల్లగా నడిపించుకు వెళుతోంది. ఆమె చెయ్యిపట్టుకుని అయోమయంగా ముందుకు సాగుతున్నాడు. అయినా ఆమె చేతికి తన చేతికీ మధ్య ఏదో అస్పష్టమైన అగాథం ఏర్పడినట్లని పిస్తోంది.